క్లుప్తంగా

కల్వర్టు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న పీఆర్ అధికారులు

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను పీఆర్ డీఈఈ రాంమోహన్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. రూ.12 లక్షల సీఎండీఎఫ్ నిధులతో పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. నాణ్యత ప్రమాణాలను పాటించి , క్యూరింగ్ సక్రమంగా చేయాలని కాంట్రాక్టర్ ఆర్.టి. కాంతారెడ్డిని ఆదేశించారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామానికి వచ్చిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకులు విన్నవించారు. సమస్యను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయడంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియచేశారు.

సత్ప్రవర్తన, ఆత్మ విశ్వాసంతో లక్ష్య సాధన



మాట్లాడుతున్న శిక్షకుడు శ్రీలోక గురుగుంట్ల

కూడేరు: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలుగుతూ, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే జీవిత లక్ష్యం సాకారమవుతుందని హైదరబాద్‌కు చెందిన క్వాంటం లైఫ్ యూనివర్సిటీ శిక్షకుడు శ్రీలోక గురుగుంట్ల సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ-1 శిక్షణ తరగుతులు కొనసాగుతున్నాయి. కర్నూలు గ్రూప్ కమాండర్ రమేష్ , క్యాంప్ కమాండర్ కెప్టెన్ కల్నల్ సందీప్ ముంద్రా ఆధ్వర్యంలో క్యాడెట్లకు ధ్యానం, ఆత్మవిశ్వాసం, మెరుగైన విద్యార్థి గుణాలపై శ్రీలోక గురుగుంట్ల అవగాహన కల్పించారు. ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటామన్నారు. విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సుబేదర్ మేజర్ సుఖ్‌దేవ్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన 500 మంది క్యాడెట్లు, అధికారులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యాన్ని చేరండి



ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న సీఐ శేఖర్

కూడేరు: వాహనదారులు జాగ్రతగా ప్రయాణించి సురక్షితంగా గమ్యాన్ని చేరాలని ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ సూచించారు. శనివారం ఆయన ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి మండలంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్న శివరాంపేట, జల్లిపల్లి, బ్రాహ్మణపల్లి, అరవకూరు వద్ద ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బ్లాక్ స్పాట్ బోర్డులు ఏర్పాటు చేయించారు. సీఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వెంకటేశులు, నరసింహరాజు,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్ రెడ్డి

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ భవనాలు, సచివాలయం, ఆర్బీకే, వెల్ నెస్ సెంటర్ , అంగన్‌వాడీ భవనాలు , నాడు-నేడు పనులు, జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆరాతీశారు. పనులు న్యాణ్యతగా చేపట్టాలని, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.దాసానాయక్ , తహసీల్దార్ బాలకిషన్, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ నందకిశోర్, ఎంఈఓ ఓబుళపతి, ట్రాన్స్‌కో ఏఈ బాలచంద్ర, హౌసింగ్ ఏఈ చైతన్య , ఏపీఎం లీలామణి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే సీఎం లక్ష్యం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ



ఉద్దేహాళ్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తదితరులు

బొమ్మనహాళ్: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత అన్నారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అలాగే ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి నాంది పలికిందన్నారు. అర్హత ఉన్నా కేవలం ధ్రువీకరణ ప్రతాలు లేవన్న కారణంతో లబ్ధి పొందలేని ప్రజలకు అవసరమయ్యే కీలక ధ్రువపత్రాలను అందించే 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చేట్టిందన్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వ సేవలకు సంబంధించి చిన్న సమస్యను కూడా ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. జూలై 1 నుంచి 30 రోజుల పాటు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. తద్వారా ఎక్కడైనా, ఎవరికైనా పథకాలు అందకుండా ఉంటే.. వారికి కూడా మంచి చేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపడతామన్నారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వానికి సంబంధించి ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదని విమర్శించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పరిస్థితిని పూర్తిగా మార్చివేశారనానరు. పెన్షన్ కావాలన్నా..రేషన్ కావాలన్నా నేరుగా ఇంటికే తీసుకువచ్చే వలంటీర్ వ్యవస్థను తెచ్చి గ్రామ సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే ఏపీ పాలనాగతిని మార్చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్మన్ హరిత, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలా బేగం, జెడ్పీటీసీ సభ్యురాలు నీలవేణి, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వెంకటాక్షిపతిరెడ్డి, వన్నూరుస్వామి, నాగిరెడ్డి, సర్పంచ్‌లు పరమేశ్వర, యోగేశ్వరరెడ్డి, వన్నల్లి రామాంజినేయులు, తిప్పేస్వామి, కృష్ణ, ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన సబ్ స్టేషన్ల మంజూరు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గానికి నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరైనట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి, కూడేరు మండలం అరవకూరు గ్రామానికి నూతన సబ్ స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. ప్రజలు, రైతులు లోఓల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతుండడంతో.. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం వెంటనే సబ్ స్టేషన్లు మంజూరు చేసిందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే మూడు నెలల్లో అరవకూరు, పీసీ ప్యాపిలి గ్రామంలో సబ్‌స్టేషన్లు ఏర్పాటు అవుతాయన్నారు. సబ్ స్టేషన్‌ల నిర్మాణం వల్ల లోఓల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కళ్యాణదుర్గంరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మమత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జయరామ్‌రావు శనివారం తెలిపారు. మండలవాసులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవనోపాధుల అభివృద్ధికి కృషి



బెళుగుప్పలో పశువైద్యశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

బెళుగుప్ప: ప్రభుత్వం పశు ఆధారిత జీవనోపాధుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్మాణదశలో ఉన్న పశువైద్యశాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్యాణదుర్గం తిప్పేస్వామి, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్పతో కలసి ఎంపీ పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం పశు ఆధారిత ఉత్పత్తులతో జీవనోపాధులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తోందన్నారు .దీంతో రైతు కుటుంబాలు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించి మరింత అర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందన్నారు. పాడి రైతులే నష్టపోకుండా ప్రభుత్వం పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. పశువుల చికిత్స కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి నియోజకవర్గానికి రెండు మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణా, పశుగ్రాసం, చాఫ్ కట్టర్‌లను పంపిణీ చేస్తోందన్నారు. బెళుగుప్పలో నూతన పశువైద్య భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసామన్నారు. భవన నిర్మాణపనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని పీఆర్ ఇంజినీర్ సుధాకర్, సచివాలయ ఇంజినీర్ భరత్‌కు ఎంపీ సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతన్న, నాయకులు శ్రీనివాసనాయక్, రాముడు రాయల్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్, గోనూరు గ్రామాల్లో ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.ఈశ్వరరెడ్డి శనివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

29 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

కళ్యాణదుర్గంరూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 29 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఫీజు చెల్లించాలన్నారు. మీసేవా లేదా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించిన వారు రసీదుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జిల్లా కేంద్రంలోనూ ఓబీసీ విద్యార్థులు కళ్యాణదుర్గం పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఎస్టీ విభాగం అధ్యక్షుడికి సన్మానం

వజ్రకరూరు: మండలంలోని పీసీ ప్యాపిలిలో శనివారం వైఎస్సార్‌సీపీ ఎస్టీ మండల అనుబంధ విభాగం కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకమ్మ, ఎంఎల్ఓ తేజేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కిష్టప్ప, నాయకులు అర్జున్, మాబు, ధనుంజయ, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నా రు.

శ్రీవారి సేవలో మాజీ ఎమ్మెల్యే



శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ కుటుంబ సభ్యులు

ఉరవకొండ: తిరుమల శ్రీవారిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. శనివారం వీఐపీ విరామ సమయంలో మాజీ ఎమ్మెల్యేతోపాటు ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు ప్రణయ్‌రెడ్డి, సోదరుడు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్ రెడ్డితో పాటు ఇతర కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దంపతులను ఆలయ అధికారులు పట్టువస్త్రాలతో సత్కరించి స్వామి తీర్థప్రసాదాలను అందించారు.

ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా కీలకం

రాయదుర్గం: ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా కీలకమని నియోజకవర్గ ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి కేశవనాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలో ని ఏఈఆర్‌ఓ, ఎలక్షన్ సిబ్బంది, ఎలక్షన్ కంప్యూట ర్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎలక్టోరల్ జాబితా సవరణలు చేపడతామన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల వరకూ సవరణ ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన మార్పులు ఆగస్టు-2022 నుంచి అమల్లోకి వస్తాయని, దీనిపై అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి ఫాం-6లో నమోదు ప్రక్రియ వేగవం చేయాలన్నారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు బీఎల్ఓలు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎలక్షన్ డీటీ సుజాత, డీటీ బసవకుమార్, ఐదు మండలాల ఏఈఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో క్షయవ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 80 మంది క్షయవ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారికి ప్రతి నెలా ఉచితంగా పౌష్టికాహార కిట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు జయచంద్ర, కొమ్మసాని బాలచంద్ర, చిట్టా శ్రీధర్, నాగేశ్వరావు, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి

బ్రహ్మసముద్రం: ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదని జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ప్రిన్సిపాల్ సత్యవతమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులుతోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడూ ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య కు ప్రాధ్యాన్యత కల్పించారన్నారు. అనంతరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి సత్కరించారు కార్యక్రమంలో ఎంఈఓలు ఓబుళపతి, క్రిష్ణ నాయక్ , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

విడపనకల్లు: మండలంలోని పాల్తికి గ్రామంలో శనివారం జెడ్పీటీసీ హనుమంతు ఆధ్వర్యంలో ఇంటర్ హెచ్‌ఈసీలో 954 మార్కులు తెచ్చుకొని స్టేట్ ఫస్టు ర్యాంకర్‌గా నిలిచిన కీర్తిశ్రీని సత్కరించారు. ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ స్కూల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. సర్పంచులు బోయ నాగమ్మ, కేశన్న, గాజుల చన్ని వెంకటేశులు, గోపాల్, అంగడి శీనా, మార్కెట్ యార్డు డైరెక్టర్ కురుబ రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

వజ్రకరూరు: రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మ సూచించారు. శనివారం మండలంలోని పందికుంట, పొట్టిపాడు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సునీత, సుంకమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

వజ్రకరూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ విజయలలిత సూచించారు. శనివారం మండలంలోని గడేహోతురు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుభాన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

వజ్రకరూరు: రైతులకు అందుబాటులో ఉండి సలహాలు అందించాలని ఉరవకొండ డివిజన్ ఏడీఏ పద్మజ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏడీఏ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. పీఎం కిసాన్ ఈ-కేవైసీ, మట్టి నమూనాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల లభ్యత, యంత్ర సేవ, తృణ ధాన్యాల సాగు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ మధుకర్, వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీహెచ్‌ఈఓలు పాల్గొన్నారు.

'యూసీసీ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలి'

ఉరవకొండ: ముస్లింలకు వ్యతిరేకమైన యూనిఫాం సివిల్ కోడ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకోరావాలని ఆలోచించడం తగదని.. ఈ ఆలోచనను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని టిప్పు సుల్తాన్ ఇతిహద్‌హుల్ ముస్లిమిన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రియాజ్‌బాషా కోరారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింల హక్కులను భంగం కల్గించే విధానాలను అవలంభించడం దుర్మార్గమన్నారు. యూసీసీ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రత్యేకాధికారిగా ఆదిశేషానాయుడు

వజ్రకరూరు: మండల ప్రత్యేకాధికారిగా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) ఆదిశేషానాయుడు నియమితులయ్యారు. శనివారం ఆయన ఎంపీడీఓ విజయలలితను కలసి పలు అంశాలపై మాట్లాదారు.అనంతరం ఆయన వజ్రకరూరు, కొనకొండ్ల గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. దేవదాయశాఖ ఈఓ అంగదాల క్రిష్ణయ్య, ఈఓఆర్డి సదాశివ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉరవకొండ: పెన్నహోబిళం సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నముస్టూరుకు చెందిన చంద్ర(38) పెన్నహోబిళం ఆలయం కింది భాగంలో బంకు పెట్టుకుని జీవనం సాగించేవాడు. రెండేళ్ల నుంచి వ్యాపారం సరిగా లేక బయట వ్యక్తులతో చేసిన అప్పులు ఎక్కువ కావడంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి పాండురంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడికి భార్య లక్ష్మితో పాటు ముగ్గురు పిల్లలున్నారు.

'నాడు-నేడు' పనులు పూర్తి చేయండి

కణేకల్లు: 'మన బడి నాడు-నేడు' పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంఈఓలు వెంకటేష్‌బాబు, ఆర్. భవానిశంకర్ సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం 'నాడు-నేడు' పనులపై సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి రిసోర్స్ పర్సన్ శేషారెడ్డి, ఎస్ఎస్ఏ జేఈ మంజునాథ, సీఆర్‌పీ రాజేష్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

పాముకాటుతో రైతు మృతి



మృతిచెందిన లక్ష్మన్న

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడుకు చెందిన రైతు కరిడిపల్లి లక్ష్మన్న (48) పాముకాటుతో మృతిచెందాడు. తనకున్న ఎకరా పొలంలో సాగు చేసిన పత్తి పంటకు శనివారం మధ్యాహ్నం సాగు నీరు పెడుతుండగా పాము కాటేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, మృతుడికి భార్య అంజినమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి.. మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పీఎం ఆవాసయోజనతో సొంతింటి కల సాకారం

కూడేరు: ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని హౌసింగ్ డీఈ హనుమప్ప అన్నారు. ఈ పథకాన్ని ప్రవేశ పెట్టి ఎనిమిది ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం కూడేరులోని జగనన్న కాలనీలో అధికారులు, లబ్ధిదారులు సంబరాలు చేసుకున్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శేఖర్, సీఎల్‌టీసీ స్వాతి, వర్క్ఇన్‌స్పెక్టర్ అశోక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి

వజ్రకరూరు: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, తీసుకున్న రుణాలతో ప్రతి ఓ క్కరూ జీవనోపాధులు పెంచుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ ఈశ్వరయ్య సూచించారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్(ఈసీ) నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రవీంద్రబాబు, ఏపీఎం గుణశ్యాం, స్త్రీ నిధి మేనేజర్ హర్షవర్దన్, సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, కార్యదర్శి వన్నమ్మ, సీసీలు రామాంనేయులు, ఓబుశేసు, రామనంద్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయండి

- జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి
- జగనన్న సురక్ష' ఘనంగా ప్రారంభం



ఉరవకొండ: ఆమిద్యాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి



రాయదుర్గంటౌన్: 2వ వార్డులో వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

ఉరవకొండ: ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ చందా చంద్రమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళితో కలసి ఆయన పరిశీలించారు. సీఈఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామని, అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన పేదలు ఏ ఒక్కరికి అన్యాయం జరగరాదన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. అనంతరం ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సీఈఓ పర్యవేక్షించారు.

విడపనకల్లు: మండలంలోని డొనేకల్లు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, సర్పంచు పేట్లో ఎర్రెమ్మ, మాజీ సర్పంచు భీంరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచు మల్లెల జగదీష్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, సచివాలయ కన్వీనర్ రామచంద్ర, ఈఓఆర్డీ సదాశివ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు,గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నా రు.

రాయదుర్గంటౌన్: జనగన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 2వ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: జగనన్న సురక్ష పథకంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఎంపీడీఓ కొండయ్య మండలంలోని జుంజురాంపల్లిలో ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ , వీఆర్వో భీమప్ప, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు. అలాగే మెచ్చిరి గ్రామంలో తహసీల్దార్ మారుతి, ఏఓ మహేంద్ర ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

కణేకల్లు: కణేకల్లు-1 గ్రామ సచివాయల పరిధిలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ గూడెన్న, డిప్యూటీ తహసీల్దార్ రఘురామిరెడ్డి ఇంటింటా సర్వే చేపట్టారు. అలాగే ఎస్.హనుమాపురంలో మండల సచివాలయ కన్వీనర్ హనుమంతరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, ఎంఎల్ఓ సుంకేష్ తదితరులు జగనన్న సురక్ష సర్వే ప్రక్రియను ప్రారంభించారు.

బ్రహ్మసముద్రం: జగనన్న సురక్ష పథకంలో భాగంగా మండలంలోని వేపులపర్తి గ్రామంలో వలంటీర్లు చేపట్టిన ఇంటింటి సర్వేను మండల ప్రత్యేకాధికారి డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసా నాయక్, తహసీల్దార్ బాలకిషన్ , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీటీసీ బూసప్ప , సర్పంచ్ రంగప్ప , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంబదూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజ్ తెలిపారు.జూలై 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మండల వ్యాప్తంగా ఉన్న 16 గ్రామ సచివాలయాల్లో ఆయా తేదీల వారిగా మండల స్థాయి అధికారులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే శనివారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది,వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు వివరించి సమస్యలపై ఆరా తీశారు.

పాఠశాల స్థల సమస్య పరిష్కరించండి

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట ఉన్నత పాఠశాలకు సంబంధించిన స్థల సమస్యను పరిష్కరించాలని శనివారం డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఏడాది క్రితం ఆ పాఠశాలకు ఆనుకుని ఉన్న స్థలంలో కొందరు వ్యక్తులు ఓ మృతదేహాన్ని పూడ్చడంతో పక్షం రోజుల పాటు గ్రామస్తులు, విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేయాలని ఆందోళన చేపట్టడడం తెలిసిందే. అప్పట్లో ఆర్‌డీఓ నిశాంత్ రెడ్డి, అప్పటి డీఈఓ నెలరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పాఠశాల కొనసాగింది. ఈ క్రమంలో సమస్యను పరిష్కరించి పాఠశాల స్థలాన్ని స్వాధీనం చేయాలని వారు శనివారం వినతి పత్రం అందజేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సర్పంచ్ విశాలాక్షి, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.